క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జయరాములు మాట్లాడుతూ ఫోన్ల వినియోగం, అనువాంఛిత మెసేజ్‌ల వల్ల కలిగే ఇబ్బందులు, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పదని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల జోలికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు 100 డయల్ చేయాలని కోరారు. ఎండాకాలంలో చెరువులు, బావులు, కుంటలలో ఈతకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్‌రావు, బాలరాజు, బీసన్న, సోమన్న, ఏఎస్ఐ రోషన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతోనే దేశం వెనకబాటు



అమరచింత: మూఢనమ్మకాలు, సాంఘిక ఆర్థిక వివక్షతోనే దేశం వెనుకబడిందని, శాస్త్రీయ సమాజం కోసం కృషి చేద్దామని జిల్లా నాస్తిక సమాజం నాయకులు అన్నారు. పట్టణంలో చార్వకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ జీఎస్ గోపి, మూడో వార్డు సీపీఐ కౌన్సిలర్ విజయరాములు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూఢనమ్మకాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అంటరానితనం, చేతబడి, బాణామతి, నిరక్షరాస్యత వంటివి సమాజంలో పాతుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశ్నించే స్థాయికి ఎదిగినప్పుడే శాస్త్రీయ సమాజానికి పునాది ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, నాయకులు భాస్కర్, కుతుబ్ ,జాకబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన యశోదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.లక్ష ఎల్ఓసీని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం మండలకేంద్రంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మహదేవన్‌గౌడ్, సుజిత్‌కుమార్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, ముస్తఫా ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ తప్పనిసరి



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో పారిశుద్ధ్యం నిర్వహణపై గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో తిరుగుతూ డ్రెయినేజీలు, రహదారులు శుభ్రం చేయడంతో పాటు పలు పారిశుద్ధ్యంపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్లు పార్వతి, సువర్ణ, అశ్విని, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులకు సీపీఆర్‌పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు హృదయ శ్వాసకోశ పునఃరుజ్జీవన చర్య (సీపీఆర్) చేసి రోగికి శ్వాస కల్పించి ప్రాణాలను కాపాడాలని డాక్టర్ మంజుల సూచించారు. గుండెను రెండు చేతులతో ఒత్తిడి చేయడం ద్వారా ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేయడం వల్ల రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆహార నియమాలను పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని, గుండె పోటు వచ్చిన వారిని కాపాడే విధానాన్ని కళ్లకు కట్టినట్టు బొమ్మ సహాయంతో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ఎంపీడీఓ అఫ్జల్, ఆస్పత్రి సూపర్‌వైజర్ ఓం ప్రకాష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

- వ్యవసాయంలో దేశం అగ్రగామిగా నిలుస్తుంది
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు
- విద్యతోనే సమాజంలో మార్పులు
- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



సమావేశపు గది ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పాన్‌గల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు సభా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించడం అందరి బాధ్యత అన్నారు. మన ఊరు–మన బడి ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేసి నిర్మిస్తున్న సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయని, వాటిని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయరంగంలో దేశం అగ్రగామిగా నిలువబోతుందన్నారు. నెట్ వర్క్ సేవలు గ్రామీణ స్థాయికి చేరి అందరికి అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రామాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో అందక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనన్నారు.

అధికారులు కార్యాలయాలకే పరిమితం

వ్యవసాయ శాఖ పద్ధతులపై ఏఓ సాజీద్ రహమాన్ మాట్లాడుతుండగా శాగాపూర్ ఎంపీటీసీ సుబ్బయ్య అడ్డుతగులుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించకుండా కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. మన ఊరు–మన బడి అభివృద్ధి పనులు చేపట్టిన వాటికి సంబంధించిన బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని మాందాపూర్ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు.

సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి సమావేశపు గది ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులను సకాలంలో చేసినా బిల్లుల చెల్లింపులో జాప్యం అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు జిల్లా అధికారులు, ఎమ్మెల్యే, మంత్రికి వినతిపత్రాలు అందజేసినా బిల్లులు సకాలంలో అందడంలేదని వాపోయారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి అందజేశారు.

అధికారులు సమయపాలన పాటించాలి

అధికారులు సమయపాలన తప్పక పాటించాలని, అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రాధాన్యత ప్రకారం పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు ఉపాధి పనులల్లో ప్రాధాన్యత ఇస్తూ చెరువులు, సాగునీటి కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టాలన్నారు. రంజాన్ పండుగ, వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఆయన సంబంధిత ఏఈకి సూచించారు. త్వరలో ప్రారంభించే వరి కొనుగోలు కేంద్రాలల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత, మండల కోఆప్షన్ సభ్యుడు హలీమ్‌పాష, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ రఘురాములు, పీఆర్ డీఈ చెన్నయ్య, ఏఈ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ భవనాన్ని వినియోగంలోకి తేవాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో రూ.31 లక్షలతో నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ కోరారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి చేసుకున్న భవనాన్ని 4 నెలల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిచే ఘనంగా ప్రారంభించినా.. ఆ భవనం ఇప్పటికీ నిరుపయోగంగా ఉందన్నారు. విద్యాపరంగా మండలాన్ని ముందుకు తీసుకపోయే బాధ్యత మండల విద్యాశాఖ అధికారిపై ఉన్నా, అటువంటి కార్యాలయాన్ని పట్టించుకోకపోవడం చాలా బాధాకరం అని అన్నారు. వెంటనే కార్యాలయాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని జిల్లా అధికారులను కోరారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు రాములు యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కుమ్మరి గోవిందు, మద్దిలేటి, రామరాజు, పురుషోత్తంయాదవ్, రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వలేం

వనపర్తి టౌన్: ఉన్నతాధికారుల ఆమోదం లేకుండా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేమని మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి తేల్చి చెప్పారు. గురువారం పుర కార్యాలయంలో కౌన్సిలర్ వెంకటేష్‌తో కార్మికుల వేతనాలపై వాగ్వివాదం చోటుచేసుకుంది. కార్మికులకు వేతనాలు ఇవ్వనప్పుడు మీరెలా పనిచేయించుకుంటున్నారని కౌన్సిలర్ వెంకటేష్ ప్రశ్నించడంతో కొందరు కౌన్సిలర్‌లే మేము ఉన్నత స్థాయిలో మాట్లాడుతామని, బలవంతంగా విధులకు పంపిస్తున్నారని కమిషనర్ బదులిచ్చారు. దీంతో కార్మికుల జీవితాలతో ఇంకా ఎన్ని రోజులు చెలగాటమాడుతారని ఇద్దరి మధ్య మాటకుమాట పెరగడంతో కమిషనర్ భావోద్వేగానికి లోనయ్యారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అవినీతి వ్యవహారాలకు కొందరి అధికారులు కారణమని, వారికి విధుల్లో మార్పులు చేయాలని కౌన్సిలర్ వెంకటేష్ కమిషనర్‌కు సూచించారు.



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ శ్రీధర్

ఫిర్యాదు ఇస్తే పట్టించుకోరా..

మున్సిపాలిటీలో పురపాలక స్థలాలు, రహదారులు కొన్ని చోట్ల ఆక్రమణకు గురవుతున్నట్లు కొన్ని లర్లు, ప్రజలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఎందుకు పట్టించుకోవడం లేదని వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మున్సిపల్ కమిషనర్‌పై మండిపడ్డారు. ఎందుకు జాప్యం ప్రదర్శిస్తున్నారని, మీ విధులను ఎందుకు సక్రమంగా నిర్వర్తించడం లేదని, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు, దీంతో తక్షణం స్పందించిన కమిషనర్ నిర్లక్ష్యం వహించిన అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ట్రాక్టర్లకు వాడుతున్న డీజిల్‌పై రాతపూర్వకంగా అడుగుతాం, రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కౌన్సిలర్ లక్ష్మీనారాయణ కమిషనర్‌ను కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

వనపర్తి టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జీతో విచారించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీ, బోర్డు మెంబర్లను అరెస్ట్ చేయాలన్నారు. సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలని, పేపర్ లీకేజీకి కారణమైన ప్రతిఒక్కరిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణ, కేదారనాథ్, చింటు, సాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పాన్‌గల్: మండల ఎంపీటీసీల ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ మాట్లాడుతూ పాన్‌గల్ నుంచి శాగాపూర్ గ్రామానికి ఉన్న పీఆర్ రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు మార్చాలని, శాగాపూర్ పాఠశాల ఎదుట బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. మండల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు కేతేపల్లిని నూతన మండలంగా త్వరగా ఏర్పాటు చేయాలనే విషయాలను తీర్మానం చేసి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికారులకు పంపించాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాలపై ఎంపీపీ సానుకూలంగా స్పందించి తీర్మానం చేసి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కవిత, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రమాదేవి, కృష్ణ, రవికుమార్, ప్రేమ్‌కుమార్, నాగమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు హలీమ్ పాష పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని మండల పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శాగాపూర్, కిష్టాపూర్ తండాల్లో 217 మందికి పరీక్షలు నిర్వహించి 18 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఏడుగురికి కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు సరికాదు

ఖిల్లాఘనపురం: పెద్దమందడి మండలంలోని మోజర్ల రోడ్డు విషయంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన ఆరోపణలు అబద్ధమని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, పలువురు సర్పంచులు ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో పెద్దమందడి మండలం టీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, పలువురు గిరిజనులతో కలిసి వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గట్లఖానాపూర్ పరిధిలోని గొర్మిలతండా, ఓన్యతండా, స్కూల్ తండా, అడ్డాకుల మండలంలోని తిమ్మాయపల్లితండా గిరిజనుల కోరిక మేరకే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తండాలకు బీటీ రహదారి నిర్మాణం కోసం ఎస్టీ ఏజీఎఫ్ నిధులు రూ.3.56 కోట్లు మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం తండాల గిరిజనులు సోళీపురం, వీరాయిపల్లి, చీకరుచెట్టుతండా, ముందరితండా, చిన్నమందడి, అల్వాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే పెద్దమందడి మండల కేంద్రానికి వెళ్లడానికి దగ్గరవుతుందన్నారు. ఇప్పటికే స్కూల్‌తండా నుంచి అల్వాల రోడ్డు వరకు పనులు ప్రారంభించారన్నారు. ఇవేమి తెలియకుండా ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు కలుగుతున్న సౌకర్యాల పట్ల మీడియా ముందు అబద్ధాలు మాట్లాడటం సరికాదన్నారు. కనీసం ప్రాథమిక సమాచారం లేకుండా మాట్లాడటం సమంజసం కాదని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సీనానాయక్, శ్రీనునాయక్, నాయకులు మన్యనాయక్, రాజునాయక్, రాంచందర్‌నాయక్, రూప్లానాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

పాన్‌గల్: జీపీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే చెల్లించకపోతే సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జీపీల ట్రాక్టర్లతో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటయ్యయాదవ్, గౌరవ అధ్యక్షుడు బాల్యనాయక్ అన్నారు. గురువారం మండల సమావేశాన్ని బహిష్కరించి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. జీపీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు రూ.లక్షల్లో ఉన్నాయన్నారు. గతేడాది నుంచి జీపీలకు నిధులు సక్రమంగా విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు ఒత్తిడి చేసి జీపీల్లో అభివృద్ధి పనులు చేయించినా.. బిల్లుల చెల్లింపులో శ్రద్ధ చూపడంలేదని మండిపడుతున్నారు. బిల్లుల చెల్లింపు విషయంపై పలు మార్లు జిల్లా అధికారులు, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఈనెల చివరి నాటికి బిల్లులు మంజూరు చేయకపోతే పోరాటాలు చేస్తూ గ్రామాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు రాకుండా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

అ'పూర్వ' సమ్మేళనం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1969–70 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ కలయిక గురువారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ శేషాచార్యుల గెస్ట్ హౌజ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 53 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన వారు ఒకచోటకు చేరి యోగక్షేమాలు మాట్లాడుకుంటూ మురిసిపోయారు. గుండెల్లో దాచుకున్న తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు చేసిన చిలిపి చేష్టలు, ఉపాధ్యాయులను అనుకరిస్తూ చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. నాటి గురువులను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమం గుర్తుగా అందరికీ మెమొంటోలను అందజేశారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఫైర్ సిబ్బంది

అమరచింత: వేసవిలో అప్రమత్తంగా ఉంటూ అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఆత్మకూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఆత్మకూర్ పట్టణంలో సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించడం సంతోషమన్నారు. పెట్రోల్ బంక్‌ల్లో అతి జాగ్రత్తగా ఉండాలని, బంక్‌ల వద్ద సెల్‌ఫోన్ వాడడం, సిగరెట్ తాగడం వంటి పనులు చేయొద్దని సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించామని ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, అగ్నిమాపక సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్‌నరసింహ, భానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద గురువారం అన్నదానం చేశారు. నిర్వాహకులు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఖిల్లాఘనపురం ఎస్ఐ శ్రీహరి 50 కిలోల బియ్యం అందించారు.

ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు

అమరచింత: పట్టణంలోని రహమానీయ మసీదులో గురువారం ఉపవాస దీక్షాపరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు నియమ నిష్టలతో ఉపవాస దీక్ష చేపట్టడం గొప్ప దైవకార్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఉపవాస దీక్షా పరులతో కలిసి పవిత్ర ప్రార్థన చేశారు. కార్యక్రమంలో జుబేర్ అహ్మద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహంకాళీ విష్ణు, మన్నాన్, విష్ణువర్ధన్‌యాదవ్, ఆయూబ్, లచ్చన్న, మ్యాదరి రాంచంద్రి తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ఇఫ్తార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు గురువారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, మేకల సుమతి, గోపిబాబు, నాయకులు దిలీప్‌కుమార్‌రెడ్డి, సాయినాథ్, సంతోష్, మేకల ఎల్లయ్య, వేణు, ఎండీ మజీద్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఐ.సత్యారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మసీద్ వద్ద గురువారం రాత్రి ముస్లింలకు మండల టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు బాలస్వామి, సర్పంచ్ యాదయ్య, తెలుగుయువత అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాసులుతో నాయకులు హాజరై వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి వారికి ఫోన్ ద్వారా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ఖిల్లాఘనపురంలో..



పెబ్బేరులో..



పెద్దమందడిలో..

వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏల సమస్యలు పరిష్కరించాలని గురువారం నిరవధిక సమ్మె చేశారు. ఈ సమ్మెకు కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దంతనూర్ నాగన్న, నర్సిములు, అరుణ, శ్రీలత, శ్రీనివాసులు, పల్లవి, అంజనమ్మ, మంజులత, శిరీష, శారద, శ్రీవాణి, నీరజ, లావణ్య, పుష్పలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఏఓల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సమ్మె ఆగదని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద బుధవారం సమ్మెకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, తౌఫిక్ పాల్గొన్నారు.

పాన్‌గల్: ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఐకేపీ గ్రామ సహాయకులు డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. వీఏఏల సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాము, వీఓఏలు బాలరాజు, శేషయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, లక్ష్మీ, భాగ్యమ్మ, మమత, అనిత, శశికళ, పద్మ, నరేష్, బాలరాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని..

మదనాపురం: మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వీఓఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో రజిత రాజేశ్వరి, అరుణ, సంధ్య, మునికుమార్, రాజశేఖర్, జయమ్మ, సువర్ణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు నిరవధిక దీక్ష చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అలివేల, రాఘవేంద్ర, రాణి, మౌనిక, నాగన్న, ఈశయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేవల్లి మండల కేంద్రంలో గురువారం వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు.